## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బాన్సువాడ, మార్చి 23: నియోజకవర్గంలోని 55మందికి మంజూరైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను బాన్సువాడలోని తన స్వగృహంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి.. రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీడస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి లబ్ధిదారులకు ఆదివారం అందజేశారు. పట్టణానికి చెందిన 24 మంది, బాన్సువాడ గ్రామీణ మండలంలో 31 మందికి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి కొప్పుశెట్టి, తహసీల్దార్ వరప్రసాద్, ఏఆర్ఐ అశోక్, మున్సిపల్ మాజీ చైర్మన్ జంగం గంగాధర్, ఏఎంసీ మాజీ చైర్మన్ నెర్రె నర్సింహులు, నాయకులు మహ్మద్ ఎజాస్, నార్ల సురేశ్‌గుప్తా, రవీందర్ గుప్తా, పరిగె మోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లింగం, రాచప్ప పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## బాన్సువాడలో ఇఫ్తార్


ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ, మార్చి 23: బాన్సువాడలోని ఓ ప్రైవేటు గార్డెన్‌లో ఆదివారం అధికారికంగా ఇఫ్తార్ ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజు, సబ్ కలెక్టర్ కిరణ్మయి, తహసీల్దార్ వర ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిములకు ముందస్తు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ నీట్, ఎంసెట్


మోడల్ టెస్ట్ రాస్తున్న విద్యార్థులు

కామారెడ్డి, మార్చి 23: కామారెడ్డిలోని వీఆర్కే కాలేజీలో టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం మోడల్ ఎంసెట్, నీట్ నిర్వహించారు. పరీక్షకు సుమారు 120 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థుల్లో ఉన్న భయం పోగొట్టడానికి మోడల్ టెస్ట్‌ను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలు, గణిత శాస్త్ర అధ్యాపకుడు శ్రీకాంత్, ఎస్ఆర్కే ప్రిన్సిపాల్ దత్తాద్రి, కో-ఆర్డినేటర్ నవీన్, అంజల్‌రెడ్డి, రక్తదాతల సమూహ అధ్యక్షుడు జబీల్, ఉపాధ్యక్షుడు వెంకటరమణ, గంపప్రసాద్, అధ్యాపకులు గోవర్ధన్ రెడ్డి, శ్రీధర్, మహేశ్, నరేశ్, ధర్మపురి, శేఖర్, నవీన్, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

# కవిత్వం సగటు మనిషికి బాసటగా నిలవాలి

**తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్**



సమావేశంలో మాట్లాడుతున్న గఫూర్ శిక్షక్

కామారెడ్డి, మార్చి 23: కవిత్వం సగటు మనిషికి బాసటగా నిలువాలని తెలంగాణ రచయితల వేదిక (తెరవే) జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్ అన్నారు. కామారెడ్డిలో సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా గఫూర్ శిక్షక్ మాట్లాడుతూ.. సాహిత్యం ఒక సృజనాత్మక ప్రక్రియతో కూడినదని, కవులు, రచయితలు ఆలోచింపజేసి కవిత్వాన్ని రాయాలన్నారు. కామారెడ్డి సాహిత్యం ఎంతో మందికి దిక్సూచీగా నిలుస్తున్నదని, యువ కవులను ప్రోత్సహించే దశలో తెలంగాణ రచయితల వేదిక ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈనెల 28వ తేదీ శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు సీనియర్ సిటిజన్స్ ఫో రంలో తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యం లో ఉగాది కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. ప్రముఖ కవి, రచయిత ఎనిశెట్టి గంగాప్రసాద్ రాసిన పద్యదర్శిని సమస్య పూరణాల పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కవులు, రచయితలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కవులు కాసర్ల రామచంద్రం, చంద్రకాం త్, ఎనిశెట్టి గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎకనామికల్ అండ్ స్టాటికల్ సబార్డినల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

కామారెడ్డి, మార్చి 23: కామారెడ్డిలోని తెలంగాణ ఎకనామికల్ అండ్ స్టాటికల్ సబార్డినల్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మణ్, కార్యదర్శిగా రమేశ్, కోశాధికారిగా స్రవంతి ఎన్నికయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి హాజరై మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఎకనామికల్ అండ్ స్టాటికల్ వారు చేసిన సర్వే ఆధారంగానే అధ్యయనం జరుగుతుందన్నారు. నేడు వీరి పనికి తగిన గౌరవం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన కార్యవర్గ సభ్యులకు శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి నాగరాజు, సహాధ్యక్షుడు చక్రధర్, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, ఎన్నికల అధికారి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## నిలిచిన మిషన్ భగీరథ నీరు

నస్రుల్లాబాద్, మార్చి 23: బీర్కూర్‌లో మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలింది. దీంతో మండలంలోని బరంగేడ్గి, సాంభాపూర్ గ్రామాకు ఆదివారం నీరు సరఫరా కాలేదు. పైప్‌లైన్ నుంచి నీరు లీకవడంతో బీర్కూర్ ప్రాథమిక సహకార సంఘం ఆవరణలో నీరు నిలిచింది. ఈ విషయమై వాటర్ గ్రిడ్ ఏఈ రాజశేఖర్‌ను వివరణ కోరగా.. పనులను పునరుద్ధరించి నీరు సరఫరా చేసినట్లు చెప్పారు.

## ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

బీబీపేట్ (దోమకొండ), మార్చి 23: ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై స్రవంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాల సంఖ్య పెరిగిపోయిందని, గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి డెబిట్, క్రెడిట్ కార్డులు అప్‌డేట్ చేయాలని, బహుమతి వచ్చిందని ప్రాసెసింగ్ ఫీజు కోసం కొన్ని డబ్బులు పంపాలని అడుగుతారని, వారి మాటలు నమ్మవద్దని తెలిపారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి లోన్లు మంజూరయ్యాయని, వివిధ రకాల యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలని చెబుతారని, వాటిని ఇన్‌స్టాల్ చేసి వివరాలను నమోదు చేస్తే మీ బ్యాంకు ఖాతాలోని డబ్బులు సైబర్ నేరాగాళ్ల బ్యాంకు ఖాతాలోకి వెళ్తాయని పేర్కొన్నారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌తో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## రోడ్డు పైకి మురికి నీరు.. జర పట్టించుకోండి సారూ!

కామారెడ్డి, మార్చి 23: పట్టణంలోని సిరిసిల్ల రోడ్డులో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నిత్యం రద్దీ ఉంటుంది. అక్కడ ఉన్న డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదు. ఎప్పుడూ మురికినీరు నిల్వ ఉంటుంది. పలు మార్లు రోడ్డపైకి కూడా వస్తుంది. దీంతో ఆ ప్రాంతం అంతా దుర్వాసన వ్యాపిస్తున్నది. ఈ విషయమై పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. డ్రైనేజీ నీరు రోడ్డు పైకి రావడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వానకాలం పరిస్థితి మరీ దారుణంగా ఉంటుందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా బల్దియా అధికారులు స్పందించి డ్రైనేజీని శుభ్రం చేయించాలని కోరుతున్నారు.


సిరిసిల్ల రోడ్డులో నిండిన డ్రైనేజీ


ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చేరిన మురిని నీరు

## దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కురుమలు

భిక్కనూరు, మార్చి 23: మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు గొరిగె నర్సింహా ఆదివారం ఆవిష్కరించారు. డోలు చప్పుళ్లు, డీజే పాటలపై నృత్యాలు చేస్తూ ప్రధాన వీధుల్లో ర్యాలీగా విగ్రహం వద్దకు చేరుకున్నారు. అనంతరం విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో కొమురయ్య త్యాగాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్దోళ్ల మహేశ్, ఉపాధ్యక్షులు ఎర్రోళ్ల స్వామి, రవి, గ్రామ శాఖ అధ్యక్షుడు భూపాల్, ఉపాధ్యక్షులు మహిపాల్, పోచయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ


ప్రతిభ చూపిన క్రీడాకారులతో అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు

కామారెడ్డి, మార్చి 23 : రాష్ట్ర స్థాయి జావెలిన్ త్రో పోటీల్లో జిల్లాకు చెందిన ఈశ్వర్ ప్రసాద్ సిల్వర్ మెడల్, సునీత అండర్ 18 విభాగంలో 400 మీటర్ల పోటీల్లో రజత పతకం సాధించారు. వారిని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, కార్యదర్శి అనిల్ కుమార్ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకరావాలని ఆకాంక్షించారు.

## చెరువులో పడి వ్యక్తి మృతి

నస్రుల్లాబాద్, మార్చి 23: మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన కీసరి రాములు (37) ప్రమాదవశాత్తు గ్రామ చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై లావణ్య తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి చెరువు వద్దకు వెళ్లాడు. కాలు జారి చెరువులో పడ్డాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతిచెందాడు. భార్య వీణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


ఇంటింటికీ తిరుగుతూ పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సభ్యులు

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 23: ఇంటి చుట్టూ ఇంటిలో పల వాతావరణం, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని స్వచ్ఛ సర్వేక్షణ్ సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఆదివారం పట్టణంలోని ఇంటింటికీ తిరుగుతూ మహిళలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంట్లోని వ్యర్థాలను తడి, పొడి చెత్తగా వేరు చేసి ఉంచి ప్రతిరోజూ ఇంటి ముందుకు వచ్చే మున్సిపల్ చెత్తట్రాక్టర్‌లో వేర్వేరుగా వేయాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్వచ్ఛ సర్వేక్షన్ బృందం సభ్యులు శ్రీనివాస్, సాయిలు పాల్గొన్నారు.

## మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం చేస్తున్న చిన్ననాటి స్నేహితులు

రామారెడ్డి, మార్చి 23 : మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బిట్ల రవి అనే యువకుడి కుటుంబానికి 1998-1999 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన చిన్ననాటి మిత్రబృందం ఆదివారం నగదు సాయం చేశారు. రూ.10 వేల నగదు, 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో దోమల శ్రీధర్, బానూరి నర్సారెడ్డి, భూపతి, నాగరాజు, కాముని కృష్ణ, స్వామి, రవి, రాజయ్య, సుధాకర్ పాల్గొన్నారు.


# తాత్కాలిక మరమ్మతులతో పొంచి ఉన్న ముప్పు

లింగంపేట, మార్చి23: గత ప్రభుత్వం నిర్మించిన వంతెనకు ఇరువైపులా వేసిన రహదారి వరద ఉధృతికి కొట్టుకుపోవడంతో ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు వేసిన తాత్కాలిక రోడ్డు కోతకు గురికావడం.. తిరిగి తాత్కాలిక మరమ్మతులు చేయడం పరిపాటిగా మారింది. మండలంలోని నాగారం గ్రామ సమీపంలో కాసుల కత్త వంతెనను ఏడేండ్లక్రితం నిర్మించారు. వంతెన నిర్మాణంతో మండలంలోని నాగారం, బాయంపల్లి, కోర్పోల్, బాణాపూర్, కిషన్ నాయక్ తండా, లింగంపల్లి తదితర గ్రామాల ప్రజలు తమ గ్రామాలకు చేరుకోవడంతో పాటు గాంధారి మండలానికి వెళ్తుంటారు. రెండేండ్లుగా కురుస్తున్న భారీ వర్షాలకు వంతెనకు ఇరువైపులా మట్టి కొట్టుకుపోవడంతో కష్టాలు తప్పడం లేదు. భారీ వర్షాలు కురిసిన సమయంలో రహదారి కోతకు గురి కావడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో మండల కేంద్రానికి చేరుకోవడానికి తిరిగి రావాల్సి వస్తోంది. భారీ వర్షాలు కురిసిన సమయంలో కోతకు గురి కావడం, తిరిగి తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదు. వర్షాకాలం రాక ముందే అధికారులు రహదారికి ఇరువైపులా కోతకు గురి కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


భారీ వర్షాల కారణంగా కోతకు గురైన రహదారి (ఫైల్)


కోతకు గురైన చోట తాత్కాలింగా వేసిన రహదారి

## ఈదురుగాలులకు నేలకొరిగిన జొన్నపంట


వెల్లుట్ల శివారులో నేలకొరిగిన జొన్నపంట

ఎల్లారెడ్డిరూరల్, మార్చి 23: ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండలు.. మధ్యాహ్నం నుంచి వాతావరణంలో మార్పులు, సాయంత్రం ఈదురుగాలులు, వర్షాలు.. ఇది రెండు రోజులుగా కొనసాగుతున్న పరిస్థితి. శనివారం రాత్రి వీచిన ఈదురుగాలులకు మండలంలోని వెల్లుట్ల గ్రామ శివారులోని జొన్న పంట నేలకొరిగింది. వాతావరణ మార్పులతో నష్టానికి గురికావాల్సి వస్తున్నదని రైతులు వాపోయారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ


జుక్కల్ మండలంలోని బంగారుపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు

బిచ్కుంద, మార్చి 23 : పైలెట్ ప్రాజెక్టుగా జుక్కల్ మండలం బంగారుపల్లి గ్రామంలో ప్రారంభించిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆదివారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం మండలంలోని దోసుపల్లి గ్రామం నుంచి జుక్కల్ వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ శివానంద్, నాయకులు రమేశ్‌దేశాయ్, సాయాగౌడ్, సతీశ్‌పటేల్, రాములు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి..**

బిచ్కుంద, మార్చి 23 : సీసీ రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు చేపట్టాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. ఆదివారం మండలకేంద్రంతో పాటు వాజిద్ నగర్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంగాధర్, పుల్కల్ సొసైటీ మాజీ చైర్మన్ వెంకట్ రాంరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్, నాయకులు గోపాల్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

**మత సామరస్యానికి ప్రతీక రంజాన్ మాసం..**

బిచ్కుంద, మార్చి 23 : రంజాన్ మాసం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మండల కేంద్రంలో బిచ్కుంద, జుక్కల్, మద్నూర్, డోంగ్లి మండలాలకు చెందిన మైనార్టీలు ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు.

## భగత్ సింగ్ ఆశయ సాధనకు కృషి చేయాలి


కామారెడ్డిలో భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కామారెడ్డి, మార్చి 23: కామారెడ్డిలో పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 94వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద విద్యార్థి సేన ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దేవునిపల్లిలోని భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం కోసం చిన్న తనంలోనే ఉరితీయబడ్డ గొప్ప వ్యక్తి భగత్‌సింగ్ అని కొనియాడారు. కార్యక్రమంలో విద్యార్థి సేనా జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్, ఎన్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అరుణ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు దశరథ్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సురేశ్ తదితరులు పాల్గొన్నారు. బీర్కూర్ గ్రామస్తులు భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రవి, హర్ష, రియాజ్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

**జుక్కల్ మండల కేంద్రంలో..**

బిచ్కుంద, మార్చి 23 : నేటి యువత భగత్ సింగ్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అజయ్ అన్నారు. జుక్కల్ మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు విలాస్, ఉపాధ్యక్షుడు షేక్ ఫిర్దోస్, కమిటీ నాయకుడు జమీల్, ప్రముఖ విద్యావేత్త రమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

లింగంపేట, మార్చి23: ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి జహీరాబాద్ ఎంపీ సురేశ్‌షెట్కార్ నిధుల నుంచి 2.85 కోట్ల రూపాయలు మంజూరైనట్లు దిశ అడ్వయిజరీ కమిటీ సభ్యుడు దేశ్‌ముఖ్ రాజు తెలిపారు. గాంధారి మండలానికి రూ.50 లక్షలు, సదాశివనగర్ మండలానికి రూ.35లక్షలు, తాడ్వాయి మండలానికి రూ.45లక్షలు, నాగిరెడ్డిపేట మండలానికి రూ.45 లక్షలు, ఎల్లారెడ్డి మండలానికి రూ.50లక్షలు, లింగంపేట మండలానికి రూ.60లక్షల చొప్పున నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు.

## వాహనాల తనిఖీ


నిజాంసాగర్ మండలం మాగి గేటు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

లింగంపేట, మార్చి 23: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట స్థానిక ఏఎస్సై ప్రకాశ్ ఆధ్వర్యంలో ఆదివారం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లు పరిశీలించి, వెంటనే చెల్లించాలని సూచించారు. పెండింగ్ చలాన్లు చెల్లించకుంటే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. బైక్‌పై ప్రయాణిస్తున్న సమయంలో కచ్చితంగా హెల్మెట్ వినియోగించాలని సూచించారు. హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్నా పట్టించుకోకుండా తిరుగుతున్న 15 మంది వాహనదారులకు జరిమానా విధించినట్లు ఏఎస్సై ప్రకాశ్ తెలిపారు. ఏఎస్సై వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

**మాగి గేటు వద్ద..**

నిజాంసాగర్, మార్చి 23 : మండలంలోని మాగి గేటు వద్ద పోలీసులు ఆదివారం వాహనాలు తనిఖీ చేశారు. హెల్మెట్, సరైన ధ్రువపత్రాలు లేకుండా మద్యం సేవించి వాహనాలు నడిపిన మొత్తం 30 మంది వరకు వాహనదారులపై కేసు నమోదు చేశామని ఎస్సై శివకుమార్ తెలిపారు.

## కొనసాగుతున్న మోడల్ హౌస్ నిర్మాణ పనులు

లింగంపేట, మార్చి23: ఆయా మండలాల్లో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ విజయ్‌పాల్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమీపంలో నిర్మిస్తున్న మోడల్ హౌస్ నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించారు. లింగంపేటలో నిర్మిస్తున్న మోడల్ హౌస్ నిర్మాణ స్లాబ్ పనులు పూర్తయినట్లు తెలిపారు. మాచారెడ్డి, దోమకొండ మండలాల్లో రూఫ్ వరకు పూర్తయ్యాయన్నారు. బీబీపేటలో స్లాబ్ వేయాల్సి ఉన్నదన్నారు. సదాశివనగర్, తాడ్వాయి, రాజంపేట మండల కేంద్రాల్లో నూతన విధానంతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో నరేశ్, డీఈఈ సుభాష్, ఏఈ అశోక్ ఉన్నారు.

## మార్కవుట్ చేసిన వారు పనులు ప్రారంభించాలి

ఎల్లారెడ్డి రూరల్, మార్చ్ 23: ముగ్గుపోసిన వారు ఇంటి నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలని ఎంపీడీవో ప్రకాశ్ సూచించారు. ఆదివారం ఆయన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. గ్రామంలో 11మంది లబ్ధిదారులు మార్కవుట్ చేసుకున్నారని, తొందరగా ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించాలన్నారు. మిగతావారు వెంటనే మార్కవుట్ చేసుకోవాలన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**పాస్‌పోర్ట్ పోయినది**

★నేను కుమ్మరి రవికుమార్ తండ్రి సంగయ్య, ని|| ఇ.నెం.9-31/1 గ్రా|| & మం|| గాంధారి, జి|| కామారెడ్డి నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం. U9808130 గలది కామారెడ్డి నుండి గాంధారికి బస్సులో వస్తున్నప్పుడు నా బ్యాగ్ పోయినది. దయచేసి ఎవరికైన దొరికినచో సంప్రదించు నెం.8464892289, 6281218070
NTZ-338419

**WANTED**

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-330667-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.